

ప్లాస్టిక్‌ను నివారిద్దాం..పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ప్లాస్టిక్ వాడకం నివారించి పర్యావరణాన్ని సంరక్షించుకుందామని హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకులు పలుకూరు వెంకటరమణ పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టాల గురించి వివరిస్తూ శనివారం పాత బస్టాండు, ఆర్ఎస్ రోడ్డు, గాంధీనగర్ తదితర ప్రాంతాలలో హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్స్‌ఫెక్టర్ భాషా తో కలిసి తోపుడు బండ్లు, చిరు వ్యాపారులకు అవగా హన కల్పిస్తూ పేపర్లు, దారపు ఉండలు అందజేసి ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నివారించాలని కోరారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని, తద్వారా వర్షాలు కురవక కరువు తాండవిస్తుందన్నారు. మూగజీవాలు ఆహారంతోపాటు ప్లాస్టిక్ నెమరువేసి తినడం వలన అనారోగ్యంపాలై మరణిస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ భూతం సర్వ మానవాళికి ముప్పు కలగజేస్తుందని వివరించారు. కార్యక్రమంలో లవ్లీ ప్రొఫెషనల్ విశ్వవిద్యాలయం, ఎస్ఆర్ఎం విద్యార్థులు కావ్య, హర్షవర్ధన్, వృద్ధి కుమార్‌రెడ్డి, వెంకటకృష్ణ, లలిత్ కాంత్, దీపక్ పాల్గొన్నారు.

మామిడి రైతులు ఆందోళన చెందొద్దు

- జెసి ఆదర్శ రాజేంద్రన్



మండీలో మామిడి కాయలను పరిశీలిస్తున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

తోతాపురి మామిడికాయ పండించే రైతులు ఆందోళన చెందవద్దని, పక్వానికి రాకముందే మామిడికాయలను కోయవద్దని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ రైతులకు విజ్ఞప్తి చేశారు. రైల్వేకోడూరులో తోతాపురి మామిడి రైతులు పడుతున్న సమస్యలు తెలుసుకునేందుకు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, కోడూరులోని మామిడికాయల మార్కెట్ యార్డుకు వచ్చి రైతులతో మరియు మండి యజమానులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందరేగా రైతులు సంయుక్త కలెక్టర్‌తో మాట్లాడుతూ పరిశ్రమలకు జ్యూస్ తయారీకి వెళ్లే తోతాపురి రకం మామిడికాయలకు కనీస ధర రావడంలేదని వాపోయారు. దీనికి స్పందించిన జిల్లా సంయుక్త కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం తోతాపూరి రకం మామిడికాయలకు మద్దతు ధరగా నాలుగు రూపాయలు నిర్ణయించిందని, కోతకొచ్చే చివరి మామిడికాయ వరకు మద్దతు ధర ఉంటుందని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం ఈ విషయంపై మీడియా సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలలో దాదాపు 2630 హెక్టార్లలో తోతాపురి మామిడి రకాన్ని రైతులు సాగు చేస్తున్నారని, దాదాపు 18 వేల నుండి 22 వేల మెట్రిక్ దిగుబడి వస్తుందని, అందులో ఇప్పటికే 8115 మెట్రిక్ టన్నులు దిగుబడిని ప్రభుత్వం ప్రకటించిన కిలోకి నాలుగు రూపాయలు సబ్సిడీ కిందికి తీసుకొని వచ్చామని, ఇంకో 8300 నుంచి 9000 మెట్రిక్ టన్నుల దిగుబడి రానున్న 15 నుండి 20 రోజుల్లో రైల్వే కోడూరు మార్కెట్కు చేరుతుందని, తోతాపురి మామిడి రకం చివరి కాయ వరకు ప్రతి రైతుకు ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీని వర్తించేలా చేస్తామని తెలియజేశారు. జ్యూస్‌కి వెళ్లే తోతాపురి మామిడికాయలకు ప్రయివేటు ధరతోపాటు అదనంగా ప్రభుత్వం ద్వారా కేజీకి నాలుగు రూపాయలు ఇస్తామన్నారు. తొందరపడి పక్వానికి రాకముందే కాయలు రైతులు కోయద్దని ఆగస్టు వరకు ప్రభుత్వం ఈ మద్దతు కొనసాగిస్తుందని రైతులు ఆందోళన చందాల్సిన పని లేదని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. కోడూరు మండలం సెట్టిగుంట వద్ద ఉన్న వర్ష మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీని సందర్శించి మామిడికాయలను కిలోపే రేటు ప్రకారం కొనుగోలు చేస్తున్నారు అక్కడ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన విద్యా సంస్థలపై చర్యలు

- ఎస్ఎఫ్ఐ డిమాండ్



తరగతులు బహిష్కరించడంతో ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శనివారం మధ్యాహ్నం వరకే పాఠశాలలు నిర్వహించాలని ఆదేశాలిచ్చినా మదనపల్లె పట్టణంలో ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిభందనలు ఉల్లంఘించి యథావిధిగా సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించారని ఎస్ఎఫ్ఐ నాయ కులు ఆరోపించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలను అమలు చేయని కార్పోరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల వద్దకు వెళ్లి తరగ తులను బహిష్కరించి విద్యార్థులను ఇంటికి పంపించినట్లు తెలిపారు. ఆది, శనివారాల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు చదువు తప్ప మరేమి లేకుండా మానసికంగా వేధిస్తున్నారన్నారు. ఆట, పాటలతో ఉండాల్సిన విద్యార్థులు నాలుగు గోడలు మధ్య బంధీగా ఉండాల్సిన పరిస్థితి దాపురిం చిందని పేర్కొన్నారు. డిఇఒ, డిప్యూటీ డిఇఒ దృష్టికి తీసుకెళ్లినా కూడా చెవులు వుండి వినలేని, కళ్ళు ఉండి చూడ లేని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేట్ పాఠశాలలు యూనియన్ పేరుతో నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ అధికారులను మేనేజ్ చేసుకుంటామనే ధీమాతో గౌతమ్ స్కూల్ విద్యాసంస్థల చైర్మన్ లక్ష్మీనారాయణ, సెవెన్ హిల్స్ స్కూల్ కరెస్పాండెంట్ రఘునాథరెడ్డి వ్యవహరిస్తున్నారని అన్నారు. వారిపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆ పాఠశాలల ఎదుట ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమీర్, సుల్తాన్, బన్నీ, శ్రీహరి పాల్గొన్నారు.

అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి : బివైఎస్



డివైఇఒ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బివైఎస్ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అధిక ఫీజులు వసూలు పలు ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన ఆధ్వర్యంలో శనివారం స్థానిక డివైఇఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. విద్యను వ్యాపారంగా మార్చి అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోపిడీ చేస్తూ, నియమ నిబంధనలకు తూట్లు పొడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డివైఇఒ లోకేశ్వర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ మదనపల్లె పరిధిలో ప్రైమరీ స్కూల్స్ ప్రారంభించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎల్‌కెజి పిల్లలకు రూ.35వేల నుంచి రూ.50 వేల వరకు ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారన్నారు. చాలా స్కూల్స్ ప్రభుత్వ నియమ, నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని, ఎక్కువ స్కూల్స్ లో సర్టిఫైడ్ స్టాఫ్ లేరన్నారు. ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం ఒక తరగతికి ఎంత ఫీజు వసూలు చేయాలో అంత ఫీజు కాకుండా వారికి నచ్చినట్టు వేలకు వేలు ఫీజులను వసూలు చేస్తూ తల్లిదండ్రులను విద్య పేరుతో దోపిడీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బివైఎస్ నాయకులు హరీష్, హరికృష్ణ, జిలాని బాషా, శశి కుమార్, వినయ్, శ్రీధర్, సద్దల హరి, శ్రీనివాసులు, రమేష్, నిజాం, కుమార్, సాయి, బ్రహ్మ, సంతోష్, శశి, తేజ, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు



ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన కడపలోని ఎసిఎ స్టేడియంలో ఉదయం 7.30 గంటలకు అండర్-14, అండర్-16 బాలుర జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఆసక్తిగల క్రికెట్ క్రీడాకారులు హాజరు కావాలని కోరారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఎవరికి కావాల్సిన క్రికెట్ కిట్, వైట్ డ్రెస్, షూ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా తమతో పాటు ఆధార్ కార్డు కాపీ, జన్మదిన ధ్రువీకరణ పత్రం(ఫారం 5) ఒరిజినల్‌తో పాటు, ఒక సెట్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. అండర్-14 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2011 సంవత్సరం సెప్టెంబర్ నెల 1వ తేదీ తరువాత గానీ, 2013 ఆగస్టు నెల 31వ తేదీ ముందు గానీ జన్మించి ఉండాలని తెలిపారు. అండర్-16 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2009 సంవత్సరం సెప్టెంబర్ నెల 1వ తేదీ తరువాత గాని, 2011 సంవత్సరం ఆగస్టు నెల 31వ తేదీ ముందు గానీ జన్మించి ఉండాలని తెలిపారు.

నేటి నుంచి మల్టీ డే క్రికెట్ టోర్నీ ప్రారంభం : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎసిఎ సహకారంతో ఈనెల 22వ తేదీ నుండి కడపలోని ఎసిఎ స్టేడియం, కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ఎసిఎ సౌత్ జోన్ అండర్-19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. టోర్నమెంట్‌లో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జట్లు పాల్గొననున్నాయి. శనివారం నాటికి అన్ని జట్లు కడపకు చేరుకున్నాయి. వారికి భోజనం వసతులను జిల్లా క్రికెట్ అసోసియేషన్ సిద్ధం చేసింది. ఆటకు అనువుగా ఎసిఎ స్టేడియం, కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానాలను క్యూరీయేటర్లు బాలరాజు, హరి సిద్ధం చేశారు.

బదిలీలలో ఎంటిఎస్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

- కడప డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-కడప అర్బన్

22వ తేదీ నిర్వహించ తలపెట్టిన కౌన్సెలింగ్‌లో ఎంటిఎస్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని యుటిఎఫ్ జిల్లా శాఖ డిఇఒకు విజ్ఞప్తి చేసింది. శనివారం కడపలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిఇఒ షేక్.షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ఎంటిఎస్ ఉపాధ్యాయులకు నిర్వహించ తలపెట్టిన కౌన్సిలింగ్ ప్రదర్శించిన ఖాళీలు అసంబద్ధంగా, నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. నిబంధనల మేరకు ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో బదిలీ పొంది, రిలీవర్ లేక రిలీవ్ కాకుండా నిలిచిపోయిన వారి స్థానాలను మాత్రమే చూపించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా ఖాళీలను చూపెట్టాలని తెలిపారు. దీనివల్ల బదిలీ పొంది రిలీవర్ లేక నూతన పాఠశాలలో చేరలేక అదే స్థానంలో కొనసాగాల్సి వస్తున్నదన్నారు. తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఎంటిఎస్ ఉపాధ్యాయులు సుదూర ప్రాంతానికి వెళ్లి పని చేయాల్సి వస్తున్నదన్నారు. ఈ విధానం ఎంటిఎస్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాన్ని కలిగించడంతోపాటు, సాధారణ బదిలీలలో బదిలీలు పొందిన ఉపాధ్యాయులు సైతం రిలీవర్ లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు ఈ విషయంపై తక్షణమే స్పందించి ఇప్పుడు ప్రదర్శించిన ఖాళీలను మార్పు చేయాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాల నుంచి పూర్తిస్థాయిలో బదిలీ పొంది, రిలీవర్ లేక ఖాళీగా ఉన్న అన్ని స్థానాలను ఖాళీలుగా చూపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంటిఎస్ ఉపాధ్యాయులు రామకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.



కడప డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు



మాట్లాడుతున్న జిల్లా అదనపు జడ్జి మహేష్

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి-పీలేరు

లోక్ అదాలత్ సేవలను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా పోలీసులు వారిని ప్రోత్సహించాలని పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి ఎ.మహేష్ తెలిపారు. శనివారం స్థానిక 11వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో, న్యాయస్థానం పరిధిలోని ఆరు మండలాలకు చెందిన పోలీసులు, ఎక్సైజ్, ప్రొహిబిషన్స్ అధికారులతో, జూలై 5న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా సూచించారు. ముఖ్యంగా లోక్ అదాలత్‌కు అధిక సంఖ్యలో కేసులు తీసుకువచ్చి వాటిని పరిష్కరించుకునేలా కక్షి దారులను ప్రోత్సహించాలని ఆదేశించారు. గతంలో పీలేరు లోక్ అదాలత్ నుంచి రాజీమార్గంలో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేవని, ఇప్పుడు వాటి సంఖ్య తగ్గకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్, పీలేరు సిఐ యుగంధర్, ఎస్ఐ లోకేష్, భాకరాపేట ఎస్ఐ రాఘవేంద్ర, ఎర్రావారిపాలెం, రొంపిచర్ల, సదుం, కెవి పల్లి పోలీస్ స్టేషన్లో నుంచి ఏఎస్ఐలు, పీలేరు, పులిచెర్ల, చంద్రగిరి ఎక్సైజ్, ప్రొహిబిషన్స్ పి.లక్ష్మీ నరసయ్య, భాస్కర్ రెడ్డి, ఎం.సుధాకర్ రావు, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఉమ్మడి కడప జిల్లాలో మినిమమ్ టైం స్కేల్‌పై పనిచేస్తున్న డిఎస్‌సి 2008, 1998 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఈ నెల 22న ఉదయం 9 గంటలకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డిఇఒ షంషుద్దీన్ ఒక ప్రకటన తెలిపారు. ఉపాధ్యాయుల జాబితా జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. జాబితాలో పేర్లు ఉన్న ఉపాధ్యాయులు తప్పకుండా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

వైసిపి బలోపేతానికి నిస్సార్ అహమ్మద్ పనితీరు భేష్

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటి నుంచే దృష్టి సారించి వైసిపిని బలోపేతం చేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారని మదనపల్లి వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ తెలిపారు. శనివారం తిరుపతిలోని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని వైసిపి శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డి వారిని కలిసి దుశ్శాలువతో సన్మానించి పూలబోకెలు అందించారు. అనంతరం మదనపల్లెలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. గతంలో చురుకుగా పనిచేసి ప్రస్తుతం మిన్నకుండిపోయిన వారి గురించి ఆరా తీశారు. తనను కలిసిన వారికి స్పష్టమైన సూచనలు చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో వైసిపి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, గ్రామస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకుని పోయి పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వంపైన ప్రజలలో వున్న అభిప్రాయం సేకరించి, ప్రజా వ్యతిరేకతను ప్రజలకు తెలిసే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. పెద్దిరెడ్డిని కలసిన వారిలో వి.ఎస్.రెడ్డి, ఆవుల మల్లికార్జున, రఘునాథరెడ్డి, రమేష్, మహేశ్వరరెడ్డి, శంకర, వెంకటేష్, రాఘవ, బాలకృష్ణ, హరినాథ్, ప్రసాద్, దినకర్ ఉన్నారు.



నిస్సార్ అహమ్మద్‌ను సన్మానిస్తున్న రామచంద్రారెడ్డి



కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

సాంకేతిక విజ్ఞానం అవసరం

- పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానం చాలా అవసరమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఐసిఐసిఐ బ్యాంక్ ఫౌండేషన్ సమకూర్చిన 40 కంప్యూటర్లతో శిక్షణ కేంద్రాన్ని కంభంవారిపల్లిమండలం, గ్యారంపల్లెలోని గురుకుల పాఠశాలలో శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాభివృద్ధి అందించే దిశగా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటూందన్నారు. ఈ క్రమంలోనే అవసరమైన చోట కంప్యూటర్ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి, విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించి, వారిలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందిం చడానికి చర్యలు తీసుకుంటూందన్నారు. గురుకుల పాఠశాల విద్యార్థులు కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని సద్విని యోగం చేసుకుని, తగిన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. గురుకుల పాఠశాలలో అత్యధిక మార్పులు సాధించి ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రత పట్టని కార్పొరేట్ విద్యా సంస్థలు : పిడిఎస్‌యు

ప్రజాశక్తి-కడప అర్బన్

బస్సుల ఫీజుల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థుల భద్రత విషయంలో పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తు కండిషన్ లేని కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థల బస్సులను రవాణా శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సీజ్ చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు. ఎం అంకన్న కోరారు. శనివారం నగర శివార్లలోని జిల్లా ఉప రవాణా శాఖ కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ అధికారి నిరంజన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందరేగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కడప నగరం, బద్వేల్, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు నియోజకవర్గం ప్రాంతాల్లోని కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు డొనేషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ, మరోవైపు బస్సుల ఫీజుల పేరుతో తక్కువ కిలోమీటర్ల గాను వేలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల బస్సులు కాలం చెల్లిన, సామర్థ్యం లేని బస్సులు అనేకంగా ఉన్నాయని తెలిపారు. ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించకుండా బస్సులు తిరుగుతున్నాయని చెప్పారు. పలు కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల అయితే తక్కువ జీతం ఇస్తూ డ్రైవర్లను నియమించుకుని లైసెన్సులు లేకుండా కొనసాగిస్తూ వారి శ్రమను వాడుకుంటున్నారని పేర్కొన్నారు. బస్సులో సహాయకుడిగా విధిగా నియమించాల్సి ఉండగా నియమించలేదని తెలిపారు. జిల్లాలో ప్రతి ఒక్క విద్యా సంస్థల బస్సులో ఫస్ట్ ఎయిడ్ కిట్టును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రస్తుతం అవి కనబడలేదని పేర్కొన్నారు. మోటార్ వాహనాల చట్టానికి విరుద్ధంగా వాహన పర్మిట్, ఫిట్నెస్, కాలుష్య నియంత్రణ, బీమా, డ్రైవర్ లైసెన్స్ పత్రాలు బస్సులో నిత్యం ఉండాలని అవి ఉండడం లేదని చెప్పారు. కావున స్పందించి రవాణాశాఖ అధికారులు మోటార్ వాహనాలకు చట్టానికి విరుద్ధంగా తిరుగుతున్న కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రత కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా నాయకులు మహేష్, కార్తీక్ పాల్గొన్నారు.

'గ్రంథాలయం నాగరికతకు చిహ్నం'

ప్రజాశక్తి-కడప అర్బన్

గ్రంథాలయం నాగరికతకు చిహ్నమని యోగి వేమన విశ్వ విద్యాలయ ఆచార్యులు డాక్టర్ ఎన్.ఈశ్వర రెడ్డి అన్నారు. శనివారం సెంట్ జోసెఫ్ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రధాన అధ్యాపకులు సొదుం రజనీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో వికాస్ ఫౌండేషన్ తరపున వీరపునాయునిపల్లె మండలం ఉరుటూరు గ్రామంలో నూతనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ పేరుతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో గ్రంథాలయం స్థాపించి, గ్రామీణ యువతను విజ్ఞానవంతులను చేయడానికి కృషి చేయడం ఆహ్వానించ పరిణామంగా కొనియాడారు. ప్రపంచ పోకడ గురించి తెలుసుకోవాలంటే పత్రికలు చదవాలని, లోతైన అవగాహన కోసం పుస్తకాలు చదవాలన్నారు. ఇప్పుడు ప్రపంచాన్ని విజ్ఞానం శాసిస్తోందని, ఆ విజ్ఞానం చదువుతోనే సాధ్యమని వివరించారు. గ్రంథాలయ అభివృద్ధిలో ఊరి ప్రజలు కూడా భాగస్వామ్యం వహించాలని పిలుపునిచ్చారు. సొదుం జయరాం, సొదుం రామమోహన్ లాంటి ప్రసిద్ధ కథకులు పుట్టి పెరిగిన గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించే అవకాశం తనకు లభించడం గొప్ప అవకాశంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సొదుం రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ సీమల్లో పుట్టి పెరిగి, చదువుకుని మంచి పదవుల్లో వున్న ప్రతి ఒక్కరూ తాము పుట్టి పెరిగిన గ్రామాభివృద్ధికి ఎంతో కొంత సహాయం చేయాలని కోరారు. అలాంటి ఆలోచనే ఇక్కడ గ్రంథాలయ ఏర్పాటుకు ఊతం ఇచ్చిందన్నారు. ఉరిటూరి గ్రామస్తులతో పాటు పాఠశాల విద్యార్థులు కూడా గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. డిజిటల్ పుస్తకాల కోసం కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యం కూడా త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఉరిటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన అధ్యాపకులు సుధారాణి మాట్లాడుతూ పుస్తకం హస్త భూషణమే గాక జీవితాన్ని మార్చే గొప్ప సాధనం అని, పాఠ్య పుస్తకాలతో పాటు ఇతర గ్రంథాలను కూడా అధ్యయనం చేయడం వల్ల ఉన్నత స్థితికి చేరుకోగలరని తెలిపారు. వైవీయూ వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎస్.రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పుస్తకమే ఇంటికి నిజమైన ఆభరణమని, అది లేని ఇల్లు నిజమైన పేదరికంలో మగ్గుతున్నట్టుగా లెక్క అంటూ పుస్తక ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉరుటూరు గ్రామాభివృద్ధి సభ్యులు తిరుమల రెడ్డి, మురళీధర రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అందరికీ విద్య, ఉపాధి కోసం కేరళలోని కోజికోడ్‌లో ఈ నెల 27వ తేదీన జరిగే అఖిలభారత ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ కోరారు. శనివారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ అఖిలభారత మహాసభలు పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జాతీయ ఉద్యమ స్ఫూర్తి, అమరవీరుల వారసత్వంతో 1970లో కేరళ రాష్ట్రంలోని త్రివేం డ్రంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందని తెలిపారు. స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యంగా అలుపెరగని పోరాట ప్రయాణంలో 55 వసంతాలు పూర్తి చేసుకుందని, 50 లక్షల సభ్యత్వంతో దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా రూపుదిద్దుకుందన్నారు. భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ కోసం ఈ నెల 27 నుండి 30వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలో జరిగే అఖిలభారత మహాసభలకు తెలుగు రాష్ట్రం నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. విద్యా రంగంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో కార్పొరే టీకరణ, కాషాయీకరణ, కేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తు కార్యాచరణ కోసం జరిగే ఈ మహాసభలకు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, మేధా వులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్రం వచ్చి 77 ఏళ్ళు గడుస్తున్నా విద్య అందని ద్రాక్షగా మారిందన్నారు. ప్రస్తుతం సమాజంలో ఎన్ని అసమానతలు అంతరాలు ఉన్నాయో అన్నింటిని నేటి విద్యారంగం కళ్ళకు కట్టినట్టు చూపిస్తుందన్నారు. విద్యపై ప్రభుత్వాలు తమ భాధ్యతను మరిచి కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ విద్యపై సవతి తల్లి ప్రేమను కురిపిస్తుదని విద్యా రంగంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో కార్పొరేటీకరణ, కాషాయికరణ, కేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తున్నదన్నారు. పాఠ్య పుస్తకాల్లో చరిత్రను, స్వాతంత్ర సమరయోధులు, మహా నాయకులు, దేశభక్తుల చరిత్రను వక్రీకరిస్తున్నారన్నారు. సోషలిజం, లౌకికవాదం అంశాలను రాజ్యాంగం నుండి తొలగించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గురునాథ్, ఎస్ఎఫ్ఐ నాయకులు బన్నీ, గణేష్, రాజేష్, సాయి, సమీర్, హరికృష్ణ, కిషోర్ చౌదరి, రెడ్డి కృష్ణ, హరి, ప్రణీత్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

మొక్కల పెంపకంలో భాగం కావాలి

ప్రజాశక్తి-నందలూరు

మొక్కల పెంపకం మానవ జీవన శైలిలో ఒక భాగం కావాలని మండల ప్రత్యేక అధికారి గుణశేఖర్ పిళ్ళై, తహశీల్దార్ అమరేశ్వరి, ఎంపిడిఒ రాధాకృష్ణ, సర్పంచ్ జంబు సూర్యనారాయణలు పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీలో ర్యాలీ నిర్వహించి పంచాయతీ కార్యాలయం సర్కిల్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని చెప్పారు. కాటన్ సంచులను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రజలు పూర్తిస్థాయిలో భాగస్వాములు అయితేనే ఏదైనా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్డి సురేష్‌బాబు, గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్, సచివాలయ కార్యదర్శి వెంకటరమణ, వెంకటయ్య, మట్టిబాబు,శివ, గంగాధర్, నరసింహులు, ఉపాధిహామీ, వెలుగు సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


వరలక్ష్మీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న తహశీల్దార్ పుల్లారెడ్డి

పారదర్శకమైన సేవలు అందిస్తాం

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రజలకు పారదర్శకమైన సేవలను అందిస్తామని పుల్లంపేట తహశీల్దార్ పుల్లారెడ్డి, చిట్వేలి తహశీల్దార్ స్పందన, కోడూరు తహశీల్దార్ కోనేటి అమర్నాథ్, ఓబులవారిపల్లి తహశీల్దార్ యామిని తెలిపారు. శనివారం కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. ముక్కా సతీమణి వరలక్ష్మీ, తనయుడు సాయివికాస్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారు పరస్పరం అభినందనలు తెలుపుకొని, గ్రామీణాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పరిపాలనా సమర్థతపై సమాలోచనలు జరిపారు. అధికా రులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, న్యాయమైన, పారదర్శక పాలన అందిం చడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.

జాయింట్ పట్టాలపై మరో అవకాశం

ప్రజాశక్తి-రామాపురం


మాట్లాడుతున్న తహశీల్దార్

మండలంలోని రీ-సర్వే పూర్తయిన గ్రామాలలో వెబ్‌ల్యాండ్-2లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూమి యజమానులు తమ జాయింట్ ఎల్‌పిఎం నెంబర్లు విడగొట్టుకోవడానికి మరో అవకాశం కల్పించినట్లు తహశీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం తాహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రీసర్వే పూర్తయిన గువ్వల చెరువు, కల్పనాయం చెరువు, నీలకంఠ రావుపేట, సుద్దమల, సరస్వతిపల్లి, చిట్లూరు , హసనాపురం, పొత్తుకూరిపల్లె, బండపల్లి రెవిన్యూ గ్రామాలలో జాయింట్ యజమానులు వారి భూములను విభజన చేయుటకు గతంలో ప్రభుత్వం నిర్దేశించిన రూ.500 రుసుమును పూర్తిగా మినహాయించి నట్లు తెలిపారు. నామమాత్రపు దరఖాస్తు రుసుము కింద రూ.50లు గ్రామ సచివాలయంలో చెల్లించి జూన్ 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని జాయింట్ పట్టాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వసంక్షేమ పథకాలైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకములకు అర్హులవుతారన్నారు. అన్నదాత సుఖీభవ పథకము వలన ఇబ్బంది పడుతున్న రైతులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకుంటే ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు.

కలికిరి ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా పాములేటి

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా పాములేటి శనివారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇదివరకు విధులు నిర్వర్తిస్తున్న మహేశ్వరి బాయ్ కలకడ మండలానికి బదిలీ కాగా అప్పటినుంచి స్థానం ఖాళీగా ఉండడం వల్ల ప్రజలు పలు సమస్యలను ఎదుర్కొన్నారు. సమస్య లను గమనించిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాలు మేరకు ఆ స్థానంలో వాయల్పాడు తహశీల్దార్‌గా పనిచేస్తున్న పాములేటిని ఇన్‌ఛార్జిగా నియమిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రజలకు ఎలాంటి రెవిన్యూ సమస్యలు ఉన్న తక్షణమే స్పందించి పరిష్కరించడానికి కృషి చేస్తానని, రెవిన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సహకరిం చాలని కోరారు.

గుండెపోటుతో టిడిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు

పిటిఎం మండలంలోని పట్టెంవాండ్లపల్లె పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన టిడిపి నాయకుడు ఆది మూర్తి(52) గుండె పోటు తోమృతిచెందారు. గ్రామం లో పెద్దదిక్కుగా ఉన్న ఆయన మృతి చెందడంతో గ్రామంలో విషాధ చాయలు అలు ముకున్నాయి. నియో జకవర్గ ఇన్‌ఛార్జి జయ చంద్రారెడ్డి, నాయ కులు గుత్తికొండ త్యాగరాజు, శ్రీనాథ్‌రెడ్డి, రమణ, సురేంద్రనాయుడు ఆయన భౌతికాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనకు నివాళులు అర్పించారు.

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలికిరి

తెలుగుదేశం పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసే బాధ్యత క్లస్టర్ ఇన్‌ఛార్జిలదేనని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగిరిపల్లిలోని ఎమ్మెల్యే స్వగృహంలో సంస్థ గత ఎన్నికలు నిర్వహించి మండలాల క్లస్టర్ ఇంచార్జ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని వారికి సూచించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీకి పూర్తి మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని సూచించారు. ఈ పార్టీ సంస్థ గత ఎన్నికల్లో పీలేరు మండలపార్టీ అధ్యక్షులుగా వి.శ్రీకాంత్ రెడ్డి, కలికిరి మండలపార్టీ అధ్యక్షులు నిజముద్దీన్, వాయల్పాడు మండలపార్టీ అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, గుర్రంకొండ మండలపార్టీ అధ్యక్షులు జగదీశ్, కలకడ మండలపార్టీ అధ్యక్షులు ప్రభాకర్‌నాయుడు, కేవీపల్లి మండలం పార్టీ అధ్యక్షులు గీతాంజలి లను ఎన్నుకున్నారు. పీలేరు ఇన్‌ఛార్జిగా ఎన్. అమరనాథరెడ్డి, ఎం.రెడ్డిబాషా, కలికిరి ఇన్‌ఛార్జిగా రమేష్, వి.చంద్ర, వాయల్పాడు కె. చంద్రమౌళి, శేషాద్రిరెడ్డి, గుర్రంకొండకు మురళి, మహాత్మ రెడ్డి, కలకడకు బి. శ్రీనివాసులరెడ్డి, కెవిపల్లెకు జి.సుధాకర్ నాయుడులను ఎన్నుకున్నారు. అనంతరం మండల అధ్యక్షులను, క్లస్టర్‌ఇన్‌ఛార్జిలనుశాలువతో కప్పి వారిని అభినందించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

బలవంతపు ఫీజుల వసూళ్లపై చర్యలు చేపట్టాలి


డివైఇఒకు వినతి పత్రం ఇస్తున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

ప్రజాశక్తి-పీలేరు

విద్యార్థుల నుంచి బలవంతపు ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న ప్రయివేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్‌తేజ, డివైఇఒ లోకేశ్వర్ రెడ్డికి శనివారం పీలేరులో వినతిపత్రం సమర్పించారు. ఆర్‌టిఇ విద్యాహక్కు చట్టంపకారం ఉచిత సీట్లు పొందిన విద్యార్థులను వేధిస్తున్న ప్రయివేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రయివేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచితంగా విద్యార్థులకు 25శాతం రిజర్వేషన్ కింద అడ్మిషన్లు కల్పించబడ్డాయని అన్నారు. కొంతమంది ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆ విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజులు కట్టమని వేధిస్తున్నాయని అన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాల తీరు ఆర్‌టిఇ చట్టానికి విరుద్ధంగా ఉన్నాయని చెప్పారు. 2009లో అప్పటి యుపిఎ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఈ చట్టం లక్షలాది గిరిజన, దళిత, పేద విద్యార్థులకు ఒక వెలుగు చూపిందని, అయితే ఇప్పుడు పాఠశాలల యాజమాన్యాల అత్యాశ చర్యల వల్ల ఆ లక్ష్యం నీరుగారే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ అలాంటి విద్యా సంస్థలపై శాఖా పరమైన చర్యలు తీసుకుని, ఆ విద్యార్థుల తల్లిదండ్రులకు అండగా నిలవాలన్నారు. బాధ్యత తప్పిన విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- బి.కొత్తకోట

పిటిఎం మండలం,బూచిపల్లిలో వైదేహి ఆస్పత్రి సహకారంతో యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీరాములు రెడ్డి, ఎఎన్ఎం రెడ్డెమ్మ, ఆశాలు శంకరమ్మ, జె.రాధమ్మ, ఫౌండేషన్ అధ్యక్షులు రాజశేఖర్, జాయింట్ సెక్రటరీ లక్ష్మణ్,రెడ్డిబాషా, పాల్గొన్నారు. భోజనవసతి సర్పంచ్ శ్రీరాములురెడ్డి, మైక్ సెట్ ఎఎన్ఎం రెడ్డెమ్మ ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి దాదాపుగా 200 మంది రోగులు హాజరు కాగా 40 మంది వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న వారికి ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామని డాక్టర్ లోకేష్ భరణి తెలిపారు .అనంతరం యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాజశేఖర్ మాట్లాడుతూ వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, తమ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు ఉచితంగా మందులు, శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరుగుతోందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మున్ముందు మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించడమే తమ లక్ష్యమన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

కలెక్టర్ చామకూరి శ్రీధర్


యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, జెసి, అధికారులు, ప్రజలు

ప్రజాశక్తి-రాయచోటి

యోగాను జిల్లా ప్రజలందరూ ప్రతిరోజు అభ్యసించి శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. జిల్లాను యోగాంధ్ర కార్యక్రమంలోని వివిధ అంశాలలో మొదటి స్థానంలో నిలిపిన జిల్లా ప్రజలకు అభినందనలు తెలిపారు.జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం రాయచోటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ నందు కలెక్టర్ శ్రీధర్ చామకూరి నాయకత్వంలో 5వేలమందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమంలోని యోగా శిక్షణలు, యోగా కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్ల పంపిణీ తదితర, అంశాలలో మొదటి స్థానంలో నిలిపిన జిల్లా ప్రజలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, డిఆర్ఒ మధుసూదన రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసు, రాయచోటి తహశీల్దార్ నరసింహా కుమార్, జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** యోగా సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంతో పాటు సర్వ రోగ నివారిణిలా పని చేస్తుందని రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. శనివారం కూచివారిపల్లిలో యోగా కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వరప్రసాద్, యోగా గురువు బాబు, కూచివారి పల్లి గ్రామస్తులు, అధికారులు, పలువురు టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కలకడ :**కలకడలోని స్థానిక ఆదర్శ పాఠశాల, జడ్‌పిహైస్కూల్(తెలుగు) జడ్‌పిహైస్కూల్(ఉర్దూ) కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాల, మరియు మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోనత, ఉన్నత పాఠశాలలో యోగాంధ్ర ఎనిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అబ్దుల్‌రహీం, తహశీల్దార్ మహేశ్వరిబాయి, ఎంఇఒ2 రామచంద్రారెడ్డి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గోవిందు, ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, సరస్వతి పాల్గొన్నారు. **నందలూరు :** యోగా దినోత్సవంలో భాగంగా నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ లోని జిల్లా పరిషత్ క్రీడా మైదానం, నాగిరెడ్డిపల్లె జడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలో నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ యోగా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్ర మంలో మండల ప్రత్యేక అధికారి గుణశేఖర్ పిళ్ళై, తహశీల్దార్ అమరేశ్వరి, ఎంపిడిఒ రాధాకృష్ణ, నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ పాల్గొన్నారు. **నిమ్మనపల్లె:** మండలంలో ఘనంగా నిర్వహించారు. యోగాలో ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, తహశీల్దార్ తపస్విని, హెచ్ఎం అంజాద్ అలీఖాన్ పాల్గొన్నారు. **రామాపురం :** మండల కార్యాలయం సముదాయం ఆవరణలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ జాషువా, ఎంఇఒ2 జయచంద్ర, మండల వైద్యాధికారి వినోద్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి నాగమణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ హుస్సేనమ్మ, సుజాత, హెల్త్ సూపర్వైజర్లు ఉమామహేశ్వరి, క్రిస్టఫర్ వెలుగు సిసి ఆదినారాయణ యోగసనాలు వేశారు. **పీలేరు:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణం, గ్రామపం చాయతీ కార్యాలయం ఆవరణంతో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎఎంసి చైర్మన్ పురం రామమూర్తి, టిడిపి నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, ఎంపిడిఒ శివశంకర్, అగ్రికల్చర్ ఎడి వైవి.రమణరావు, శ్రీలత, తహశీల్దారు శివకుమార్ పాల్గొన్నారు. **కలికిరి:** గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపిడిఒ భానుమూర్తిరావు ఆధ్వర్యంలో, ఐసిడిఎస్ సూపర్వైజర్లు అరుంధతి, రెడ్డి సర్తజ్ ఆధ్వర్యంలోని అంగన్వాడీ కేంద్రాలలో, కృషి విజ్ఞాన కేంద్రం కలికిరిలో డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో కెవికె సిబ్బంది, సైనిక్ స్కూల్ జెఎన్‌టియు ఇంజనీరింగ్ కాలేజ్ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో యోగా నిర్వహించారు.కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ, ఇఒ అశోక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పుల్లంపేట :** ఎస్‌బివిడి గ్రౌండ్‌లో ఎంపిడిఒ జయశ్రీ, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, మండల విద్యాశాఖ అధికారి చక్రధర్ రాజ, శ్రీ దినేష్, వైద్య సిబ్బంది, ఇతర అధికారులు, డ్వాక్రా సభ్యులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు.**తంబళ్లపల్లి :**ప్రతి ఒక్కరూ యోగాను ఆచరిస్తే మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎంపిడిఒ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా మండలంలో యోగా ఆంధ్ర కార్యక్రమాన్ని కోసివారి పల్లి ఉన్నత పాఠశాల శివాలయంలో యోగ మాస్టర్ సిద్ధారెడ్డి ఆధ్వర్యంలో యోగాసనాల ప్రదర్శన జరిగింది. మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ గ్రామ సచివాలయాలలో ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

డిఎస్‌పి రక్షణ కోరిన ప్రేమజంట

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రేమించి పెళ్లి చేసుకున్న తమకు పెద్దల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని శనివారం ఓ ప్రేమ జంట మదనపల్లె డిఎస్‌పి మహేంద్రను ఆశ్రయించారు. ప్రేమజంట తెలిపిన వివరాల మేరకు.. తంబళ్లపల్లె నియోజకవర్గం, పెద్దమండెం మండలం, బండ్రేవుకు దళిత వాడకు చెందిన అంజి అయ్యప్ప(23), సత్యసాయి జిల్లా, నల్లచెరువుకు చెందిన బి.భాగ్యలక్ష్మి(19) గత కొంత కాలంగా ఒకరి నొకరు ప్రేమించు కుంటున్నారు. ఒకే కులమైన తమ ప్రేమను అంగీకరించని పెద్దలు తమ పెళ్లికి ఇష్టపడలేదని, అడ్డుకుంటు న్నారని తెలిపారు. ఇద్దరం మేజర్లు కావ డంతో ఇంటి నుండి వెళ్ళి పోయి ప్రేమ వివాహం చేసుకున్నా మన్నారు. తమ కు పెద్దల నుంచి ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని మదనపల్లె డిఎస్ పిని ఆశ్రయించినట్లు తెలిపారు. స్పందించిన డిఎస్‌పి వారి పరిధిలోని ఎస్ఐ తో మాట్లాడి ఇరువురి పెద్దలను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు.


పోలీసుల రక్షణ కోరిన అయప్ప, భాగ్యలక్ష్మి

చిత్రలేఖనంలో రాణించిన విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠ శాలలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు రాణిం చారు. శనివారం ప్రపంచ యోగా దినోత్సవ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగాపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆయా తరగతుల విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో బొమ్మలు వేశారు. చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి, డ్రాయింగ్ మాస్టర్ సురేష్‌కుమార్ అభినందించారు. పోటీ పరీక్షల్లో ప్రతి విద్యార్థి పాల్గొన్నప్పుడే వారిలో ఉన్న ప్రతిభ అనేది గుర్తిం చేందుకు వీలుంటుందని శ్రీనివాసులురెడ్డి అన్నారు. నైపు ణ్యతను ప్రతి విద్యార్థి ప్రదర్శించాలన్నారు. నైపుణ్యత ఉంటేనే ఆయా రంగాల్లో కూడా రాణించేందుకు వీలు ఉంటుందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ద్వారా విద్యార్థులను ప్రోత్సహించేందుకు వీలు ఉంటుందని ఆయన చెప్పారు.


మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి శ్రీనివాసులు

రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేపట్టాలి

ప్రజాశక్తిపుల్లంపేట

మండల పరిధిలోని రేషన్ డీలర్లు వినియోగదారుల పట్ల బాధ్యతగా వ్యవహరించి రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని రెవెన్యూ అధికారులు ఆదేశించారు. శనివారం తహశీల్దార్ పుల్లారెడ్డి ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి శ్రీనివాసులు, ఆర్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో రేషన్ డీలర్ల సమీక్ష సమావేశం నిర్వమించారు.ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ మండలంలో ఉన్న రేషన్ డీలర్లు పూర్తిగా వినియోగదారుల పట్ల బాధ్యతగా పనిచేయాలని అన్నారు.30వ తేదీలోగా రేషన్ కార్డు దారులకు ఇకెవైసి చేయాలని అన్నారు. 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఏమైనా చిన్న సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని ఆర్ఐ తెలిపారు. డీలర్లు వినియోగదారులకు 15రోజులు బియ్యం అందజేయాలని పేర్కొన్నారు. రికార్డులు భద్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరైనా రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్క వినియోగదారుడికి సక్రమంగా రేషన్ సరుకులు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, మండల పరిధిలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

మండల సర్వేయర్‌గా నాగరాజు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : రెవెన్యూ కార్యాలయంలో మండల సర్వేయర్‌గా నాగరాజు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో రామసముద్రం మండలం సర్వేయర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. మండలంలో రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి భూముల సర్వే సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.


ఫౌండేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రుద్రరాజు

సేవా భావమే లక్ష్యం కావాలి

ప్రజాశక్తి-రాయచోటి

పేద ప్రజలకు సేవ చేయడంలో ఉన్న సంతృప్తి ఎందులోను ఉండదని సేవా భావమే లక్ష్యంగా ఉండాలని ఇంపాక్ట్ ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు డాక్టర్ రుద్రరాజు వెంకటరవి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎజి గార్డెన్ వద్ద ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఎన్‌జిఒ కార్యాలయంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దిగువ వర్గాల అభివృద్ధిలో వైద్యం, విద్య పాత్ర ఎంతో కీలకమైందని తెలిపారు. స్వార్థరహిత సేవా దృక్పథం ఎంత అవసరమో వివరిస్తూ, సేవా భావం కలిగిన వారు ప్రజల స్థానిక సమస్యలను అర్థం చేసుకుని నిస్వార్థంగా పనిచేయాలని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సోమలరాజు శివ రాజుకు సూచించారు. శివరాజు మాట్లాడుతు ఇప్పటికే సంస్థ ఆధ్వర్యంలో ధర్మవరం బత్తలపల్లిలో సీనియర్ సిటిజన్స్ హోమ్ నడుస్తోందని తెలిపారు. జిల్లాలో తమ ఫౌండేషన్ ద్వార విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. అనంతరం అతిధులను శివరాజు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో నేటి అమరావతి చీఫ్ ఎడిటర్ ఎమ్‌సి.హెచ్. సుబ్బారెడ్డి, విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి, జనసేన నాయకుడు మొహమ్మద్ పటాన్, టిడిపి నేత అతవుల్లా పాల్గొన్నారు.

వంటశాల నిర్మాణానికి భూమిపూజ


వంటగదికి భూమిపూజ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మల్లయ్యకొండ శ్రీ మల్లికార్జునస్వామి అన్నదాన ట్రస్ట్ సభ్యుల త్రైమాసిక సమావేశం శనివారం కనుగొన్న మద్దిరెడ్డి అన్నదాన ట్రస్ట్ భవనంలో జరిగింది. ట్రస్ట్ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రస్ట్ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సభ్యులందరికీసలహాలు సేకరించి చర్చించారు. మహాశివరాత్రి రోజు మల్లయ్యకొండకు వచ్చే భక్తుల సౌకర్యార్థం లక్షలా దిమందికి అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం జరుగుతుంది. ఇందుకు మొల కలుచె రువు మండలం చౌడ సముద్రానికి చెందిన దాత గుప్తాశేఖర్‌గుప్తా తమ సొంత నిధులతో వంటశాల షెడ్డు నిర్మాణానికి ముందుకు వచ్చారు. ఆయన దాతృ త్వానికి కమిటీ సభ్యులు అభినందించారు.

క్రైం కార్నర్

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మతిస్థిమితం సరిగాలేక ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలో వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మర్రిమాకుల పల్లెకు చెందిన బాల కృష్ణ నాయుని కొడుకు భూపతి నాయుడు(30) మానసిక స్థితి సరిగాలేక మంగళవారం తన వ్యవసాయ బోరు వద్ద చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. శనివారం చెట్లకు నీళ్ల కట్టడానికి వెళ్లిన తండ్రి చెట్టుకు ఉరి వేసుకుని కొడుకు మృతి చెందడం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో ఓ బాలిక అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. స్థానిక పోలీసుల వివరాల మేరకు. చిత్తూరు జిల్లా, తవణంపల్లి మండలం, అరగొండ గ్రామానికి చెందిన సరకంటి అంజి, వల్లెమ్మ దంపతులు కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారన్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం ఉన్నారని అన్నారు. వీరి రెండవ కుమార్తె(13) అరగొండ ప్రభుత్వ కళాశాలలో ప్రస్తుతం 8వ తరగతి చదువుతోందని అన్నారు. గత 15 రోజుల క్రితం కుమార్తె నాగేశ్వరి, చిన్న కుమారుడు వెంకటరమణ లతో కలిసి కూలి పనుల నిమిత్తం మండలంలని బండ్లపై గ్రామం, దుర్గంవారిపల్లెకు వచ్చి రైతు రెడ్డప్ప పొలంలోని అల్లనేరేడు చెట్లకు కాపలా ఉంటు న్నామన్నారు. ఈనెల 19వ తేదీ సాయంత్రం కూతురు నాగేశ్వరి కుమారుడు వెంకటరమణ కలిసి అంగడికి వెళ్లి వస్తామని వెళ్ళి, కొంతసేపటికి కుమారుడు మాత్రమే ఇంటికి వచ్చారన్నారు. కుమార్తె నాగేశ్వరి గురించి అడగగా నువ్వు ఇంటికి వెళ్ళు నేను వస్తానని చెప్పిందని కుమారుడు తెలిపారని అన్నారు. అనంతరం కూతురు ఎంతసేపటికి ఇంటికి రాకపోవటంతో చుట్టుప్రక్కల గ్రామంలోనూ, బంధువుల ఇళ్ల వద్ద రెండు రోజులుగా బాలిక ఆచూకీ కోసం ఎంత వెతికినా ప్రయోజనం లేకపోయిందన్నారు. బాలిక తల్లి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బాలిక ఆచూకీ తెలిసినవారు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.